


చాపాడు మండలం, చిన్నగుర వలూరు గ్రామంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ ఏజెంట్లు వినోద్‌కుమార్, ఉగ్రనరసింహులు

పోటెత్తిన ఓటర్లు



జమ్మలమడుగు మోరగుడిలో రోడ్డుపై బారులుతీరిన ఓటర్లు

- పోలింగ్ శాతం పెరగడంపై ఉత్కంఠ
- బ్యాలెట్‌లో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తం
- చాపాడులో టీడీపీ ఏజంట్లపై దాడి
- కోగటంలో ఉద్రిక్తత
- జమ్మలమడుగులో రాళ్ల దాడి
- చెదురుమదురు సంఘటనలు మినహాయిస్తే.. ప్రశాంతంగా పోలింగ్

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పోటెత్తారు. అనూహ్యంగా పెరిగిన పోలింగ్‌పై ఎవరికీ అనుకూలంగా ఉంటుందోనంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ఎన్నికలను టీడీపీ, వైసీపీతో పాటు కడప పార్లమెంటుకు కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎన్నికల షెడ్యూలు విడుదల కాక ముందే ఇరుపార్టీలు వివిధ కార్యక్రమాల పేరుతో ఇంటింటికీ ప్రచారం చేశారు. అయితే ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. కొన్ని చెదురుమదురు ఘటనలు మినహాయిస్తే ప్రశాంతంగా జరగడంతో అటు పోలీసులు ఇటు జనం ఊపిరి పీల్చుకున్నారు. రోజూ భానుడు భగభగమంటూ జనానికి చుక్కలు చూపించేవారు. అయితే పోలింగ్ రోజున మాత్రం కాస్త నెమ్మదించాడు. ఉదయం పూట మబ్బులు పడుతూ చల్లగా ఉండడంతో పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు పోటెత్తారు. ఈ సారి ఎన్నికలకు జిల్లా వాళ్లే కాదు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలకు వెళ్లిన వారు కూడా ఓటువేసేందుకు వచ్చారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల రీత్యా హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, ముంబైలలో ఉన్న వారు అందరూ ఓటు వేసేందుకు పెద్దఎత్తున జిల్లా బాట పట్టారు. దీంతో ఓటర్లు అంతా పోలింగ్‌బాట పట్టారు.

పోటాపోటీగా పోల్ మేనేజ్‌మెంటు

ఎన్నికల్లో ప్రచారం చేయడం ఒక ఎత్తయితే... ఓటింగ్ రోజున వారందరినీ పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం ఒక ఎత్తు. అందుకే పార్టీలన్నీ పోల్ మేనేజ్‌మెంటుపై ఎక్కువగా దృష్టి పెడుతుంటాయి. ఈ సారి టీడీపీ, వైసీపీలతో పాటు కాంగ్రెస్ కూడా పోల్‌మేనేజ్‌మెంటు చేశాయి. కడప, కమలాపురం, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరులో టీడీపీ పోటీ చేస్తుండగా బద్వేలు, జమ్మలమడుగులో బీజేపీ పోటీ చేసింది. ఇక్కడ కూటమి అభ్యర్థులు కూడా వైసీపీకి ధీటుగా పోల్ మేనేజ్‌మెంటు చేశారు. దీంతో పెద్దఎత్తున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చారు. ఇక కడప పార్లమెంటు నుంచి సీఎం జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ ఎంపీగా ఎన్నికల బరిలో నిలిచింది. షర్మిల రాజకీయ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం కానుండడంతో ఆమె ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

పులివెందులలో సీఎం దంపతులు

ఇక సీఎం జగన్ ఆయన సతీమణి భారతిలు పిల్లలతో కలిసి పులివెందులలోని భాకరాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక పీసీసీ చీఫ్, కడప పార్లమెంటు అభ్యర్థి షర్మిలా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయలో భర్త అనిల్‌తో కలిసి ఓటు హక్కు వినియోగిచుకున్నారు. ఇక కూటమి అభ్యర్థి అనకాపల్లి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోట్లదుర్తిలో ఓటు హక్కు వినియోగించుకుని ప్రత్యేక విమానంలో అనకాపల్లి వెళ్లారు. టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టరు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు

ఎన్నికల సందర్భంగా పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వేముల మండలంలోని మబ్బుచింతలపల్లెలో వైసీపీ నేతలు ప్రలోభపెట్టే ప్రయత్నం చేయగా టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేయగా వైసీపీ శ్రేణులు టీడీపీ నేతలపై రాళ్లదాడి చేశారు. టీడీపీ నేతలు కూడా ప్రతిఘటించారు. పోలీసులు రావడంతో ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కమలాపురం మండలంలోని కోగటంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి స్వగ్రామంలో పోలింగ్ ప్రారంభమైన వెంటనే టీడీపీ అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు వెళ్లారు. అయితే అక్కడ వాహనం నిలపడంపై వివాదం జరిగింది. చివరికి రాళ్ల దాడులు చేసుకునే పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను సర్ది చెప్పారు. సంబటూరులో వైసీపీ తీరుపై చైతన్యరెడ్డి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సాయంత్రం వరకు అక్కడ ఏం జరుగుతుందనే టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రొద్దుటూరులోని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఊరిలో వైసీపీ నేతలు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

కడపలో వైసీపీ కవ్వింపు చర్యలు

కడప నగరంలోని గౌస్‌నగర్‌లోని పోలింగ్ బూత్ 63, 64, 65 బూత్‌ల వద్ద ఉదయం నుంచి వైసీపీ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే విధంగా చేస్తుండంటారు. ఇది చిలికి చిలికి గాలివానగా మారుతూ వచ్చింది. వైసీపీ కవ్వింపులు భరించలేక టీడీపీ శ్రేణులు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేడరు సంఘీభావం కోసం ఆయన గౌస్‌నగర్‌లోని పోలింగ్‌బూత్ వద్దకు వెళ్లగా... రిగ్గింగ్‌కు వస్తున్నారంటూ కార్పొరేటరు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దృష్టికి తీసుకురావడంతో హుటాహుటిన సురేష్‌బాబు, ఇతరులు అక్కడకు చేరుకున్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వివాదం చిలికి చిలికి గాలివానగా మారి పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా పెద్ద రణరంగాన్నే తలపించింది. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడుల్లో ఇద్దరు రమేష్‌రెడ్డి, మరికొందరికి గాయాలయ్యాయి. దాదాపు చాలా సేపు ఇరువర్గాలు మోహరించి రాళ్ల దాడులకు పాల్పడడంతో స్థానికులు భయంతో వణికిపోయారు. చివరికి కడప డీఎస్పీ షరీఫ్ ఇతర పోలీసు బలగాలు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టి పంపించారు.

జమ్మలమడుగులో డిష్యుం డిష్యుం

జమ్మలమడుగులో ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అండ్ కో బెదిరింపులు చివరికి ఘర్షణకు తెరలేపాయి. సుధీర్‌రెడ్డి ఈద్గా దగ్గర ఉన్న పోలింగ్ బూత్ 116, 117లో పోలింగ్ ఆలస్యంగా నడుస్తోంది. అయితే రాత్రి సుధీర్ అక్కడకి వెళ్లి టీడీపీ ఏజంటును బెదిరించడంతో అక్కడ నేతలు కడప ఎంపీ అభ్యర్థి భూపేష్ దృష్టికి తీసు కురావడంతో విషయం తెలుసుకున్న భూపేష్ మరో మాజీ ఎమ్మెల్యే శివనాథరెడ్డితో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగి పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ సంఘటనలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తలకు గాయమైనట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. ఇక వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఉన్న మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి వాహనం అద్దాలను వైసీపీ శ్రేణులు పగలగొట్టాయి. దీంతో ఉదిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ ఏజెంట్‌పై దాడి

- ఎమ్మెల్యేతో పాటు మరికొందరిపై కేసు నమోదు

చాపాడు/మైదుకూరు, మే 13: మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలో టీడీపీ ఏజెంటుపై దాడికి పాల్పడ్డంతో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో పాటు మరో 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. చాపాడు మండలం ఏ ఎన్నికల్లో అయినా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి అనుకూలం. ఆయన ప్రత్యర్థి పార్టీ ఏజెంట్‌ను కూడా పెట్టుకోలేని పరిస్థితి అక్కడ కొన్ని గ్రామాల్లో ఉంది. రఘురామిరెడ్డి సొంత మండలంలోని నక్కలదిన్నెతో పాటు పెద్దగులువలూరు, చిన్నగులువలూరుతో పాటు పలు గ్రామాలు ఆయన కనుసన్నల్లో సాగేవి. అక్కడ దాదాపు పోలింగ్ కేంద్రాలన్ని ఏకపక్షంగా జరిగేవి. సమస్యాత్మక గ్రామాలుగా కూడా అధికారులు గుర్తించారు. అయితే సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చాపాడు మండ లంలోని నక్కలదిన్నెతో సహా అన్ని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ తమ ఏజెంట్లను కూర్చోబెట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్ని కేంద్రాలు పరిశీలిస్తూ, చిన్నగులువలూరు కేంద్రంలోకి వెళ్లి పరిశీలించారు. ఆయన కేంద్రం బయటకు వచ్చిన తరువాత వైసీపీ నాయకులు పలువురు కేంద్రంలోకి వెళ్లి అక్కడ టీడీపీ ఎజెంట్లుగా ఉన్న కుచ్చుపాప ఉగ్రనరసింహులు, వినోద్‌కుమార్‌లను బయటకు లాగి రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన ఇరువురిని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ అరాచకాలు ఎక్కువయ్యాయని, ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు ఏకంగా పోలీసుల సమక్షంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తన అనుచరులను ఉసిగొలిపి ఏజెంట్లపై దాడి చేశారని అన్నారు. అధికారులు పక్షపాతం లేకుండా న్యాయంగా కేసు విచారణ చేయాలన్నారు. ఈ సంఘటనపై ఎమ్మెల్యేతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. కాగా.. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసు నమోదు చేశామని చాపాడు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, మహేశ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చంద్ర, హర్షవర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, చంద్ర, నగిలి చంద్రపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడి జరిగేలా పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ వారిని ఎమ్మెల్యే ప్రోత్సహించారని, ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

పోలింగ్ శాతం ఇలా...

తొలుత అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 9గంటల్లోపు 12.09గా జిల్లావ్యాప్తంగా పోలింగ్ నమోదైంది. నియోజకవర్గాల వారీగా 9 గంటలకు బద్వేలులో 10.2, కడప 9.67, పులివెందుల 12.44, కమలాపురం 12.8, జమ్మలమడుగు 16.39, ప్రొద్దుటూరు 12.62, మైదుకూరు 10.68, 11 గంటలకు జిల్లా వ్యాప్తంగా 27.02 శాతం నమోదైతే... బద్వేలులో 30.35, కడపలో 20.68, పులివెందుల 37.6, కమలాపురం 25.87, జమ్మలమడుగులో 33.47, ప్రొద్దుటూరు 24.87, మైదుకూరు 23.91 నమోదైంది. ఒంటిగంటకు జిల్లా వ్యాప్తంగా 45.56 శాతం నమోదైంది. బద్వేలు 48.64, మైదుకూరు 45.63, ప్రొద్దుటూరు 44.73, జమ్మలమడుగు 45.32, పులివెందుల 49.92, కమలాపురం 46.47, కడపలో 37.26 శాతం నమోదైంది. 3 గంటలకు జిల్లా వ్యాప్తంగా 60.57 శాతం పోలింగ్ నమోదైంది. జమ్మలమడుగు 65.6, పులివెందుల 64.83, ప్రొద్దుటూరు 57.98, మైదుకూరు 64.31, బద్వేలు 61.91, కడప 51.26, కమలాపురం 61.67, పులివెందుల 64.83, 5గంటలకు జిల్లా వ్యాప్తంగా 72.85 శాతం నమోదైంది. జమ్మలమడుగు 78.55, పులివెందుల 75,8, ప్రొద్దుటూరులో 72.26, కమలాపురం 75.16, మైదుకూరు 75.19, కడప 60.12, బద్వేలు 73.2, జమ్మలమడుగు 78.55 నమోదైంది.






యర్రగుంట్లలో చంటిబిడ్డలతో ఓటు వేసేందుకు వచ్చిన తల్లులు



చాపాడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

ఓటు హక్కు వినియోగించుకున్న బీటెక్ రవి, పుట్టా సుధాకర్‌యాదవ్




ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రమేశ్, భూపేశ్‌రెడ్డి







ఓటు వేసేందుకు క్యూలైన్లలో ఉన్న ముస్లిం మహిళలు



పులివెందులలో ఓటు వేసేందుకు వచ్చి ప్రజలకు నమస్కరిస్తున్న వైఎస్ షర్మిల




పులివెందులలో ఓటు వేస్తున్న సీఎం వైఎస్ జగన్, కడపలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎస్పీ

ప్రొద్దుటూరులో ఓటు వేసిన వరదరాజులరెడ్డి, జమ్మలమడుగులో ఓటు వేసిన ఆదినారాయణరెడ్డి

జగన్‌కు గడ్డుకాలం ప్రారంభం

- నాలుగు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటు వేసిన ప్రజలు
- పులివెందులలో టీడీపీ గెలుపు ఖాయం
- ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి

పులివెందుల టౌన్, మే 13: పులివెందుల నియోజకవర్గంలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వినియోగించుకున్నారని.. ఇక్కడి నుంచి జగన్‌మోహన్‌రెడ్డికి గడ్డుకాలం ప్రారంభమైందని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. ఎన్నికల పోలింగ్ అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడంతో నాలుగు దశాబ్దాల తర్వాత ప్రతి ఓటరు స్వేచ్ఛగా వారి ఓటును వినియోగించుకున్నారన్నారు. ఎటువంటి చిన్నపాటి ఘర్షణ లేకుండా పోలింగ్ జరిగిందన్నారు. సొంత నియోజకవర్గంలో జగన్‌కు వ్యతిరేక పవనాలు వీచాయని.. టీడీపీ గెలవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతుందని జగన్ ఇంటికి పోవాల్సిందేనన్నారు. వైసీపీ నాయకులు పోలింగ్ బూత్‌ల్లో టీడీపీ ఏజెంట్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు.

విజయంపై ధీమా

- తల్లి మద్దతు తనకేనన్న షర్మిల
- ఇడుపులపాయలో ఓటు వేసిన షర్మిల, అనిల్

వేంపల్లె, మే 13: వేంపల్లె మండలంలోని ఇడుపులపాయలోని మల్లేలమ్మపల్లె పోలింగ్ బూత్‌లో వైఎస్ షర్మిల, ఆమె భర్త బ్రదర్ అనిల్‌కుమార్ ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ధనికుడు, పేదవాడు అనే తేడా లేకుండా ఓటు హక్కు ఉంటుందని, రాజ్యాంగ పరిరక్షణకై ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. కడప పార్లమెంట్ అభ్యర్థిగా తప్పక గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తల్లి విజయలక్ష్మి మద్దతు తనకే ఉందని ఆమె చెప్పారు. చంద్రబాబునాయుడు డైరెక్షన్‌లో పనిచేస్తున్నామని సీఎం జగన్ పదేపదే చెప్ప డం శోచనీయమని, అన్యాయం జరిగిన చోట న్యాయం కోసం పోరాడుతున్నామని ఆమె తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం అత్యంత ఘోరంగా వివేకాను హత్య చేశారని, మళ్లీ హత్య చేయించిన నిందితుడికే ఎంపీ సీటు ఇవ్వడం శోచనీయమన్నారు. హత్య కేసు నిందితులకు ముఖ్యమంత్రి రక్షణగా ఉంటూ వచ్చారని, న్యాయం-అన్యాయానికి, ధర్మం-అధర్మానికి జరుగుతున్న ఈ ప్రజాపోరాటంలో ప్రజలంతా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న పుత్తా చైతన్యరెడ్డి



చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

నాగవరం పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్‌పై వైసీపీ మూకల దాడి

పుల్లంపేట దళాయిపల్లె పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన వైనం

రైల్వేకోడూరు హెచ్ఎంఎం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో రిగ్గింగు జరుగుతుందని మోహరింపు



గాయపడిన బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డి

రైల్వేకోడూరు, మే 13: నియోజకవర్గంలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో చెదురుముదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ వేడిమి తట్టుకోలేమని వృద్ధులు ఉదయాన్నే వచ్చి బారులు తీరి ఓట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభించారు. వికలాంగులు సైతం ఓటు వేసేందుకు ముందుకొచ్చారు. పుల్లంపేట మండలం అనంతసముద్రం పాపక్కగారిపల్లెలో జనసేన ఏజెంట్‌గా సుబ్రహ్మణ్యం ను కూర్చోబెట్టేందుకు టీడీపీ నేత ముద్దా సుభాష్‌రెడ్డి తీసుకుని వెళుతుండగా వైసీపీ నేతలు కిడ్నాప్ చేశారు. వైసీపీ నేతలు జరిపిన దాడిలో టీడీపీ నేత సుభాష్‌రెడ్డి గాయపడ్డారు. జనసేన ఏజెంట్ సుబ్రహ్మణ్యం కన్ను దెబ్బతినింది. దీంతో వారిద్దరిని చికిత్స నిమిత్తం రాజంపేట కూటమి నేతలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాగువారిపల్లెలో జనసేన ఏజెంట్‌ను బయటకు లాగేసి వైసీపీ వాహనంలో తీసుకెళ్లారు. దీంతో సుమారు గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తర్వాత ఒక ఏజెంట్ కూర్చున్న తర్వాత పోలింగ్ నిర్వహించారు. రెండోసారి కూర్చున్న ఏజెంట్‌ను కూడా వైసీపీ నేతలు లాగేశారు. ఇదిలా ఉండగా పుల్లంపేట మండలం దళాయిపల్లె పోలింగ్ కేంద్రానికి వైసీపీ నేతలు చేరుకుని జనసేన ఏజెంట్ రాజారెడ్డిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. ఇతన్ని కూడా కిడ్నాప్ చేయడానికి విఫలయత్నం చేశారు. దీంతో గ్రామస్తులు ఈవీఎంను ధ్వంసం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది. విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చంగల్ రాజు కూటమి శ్రేణులు దళావాయిపల్లెకు చేరుకుని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రౌడీలు, గూండాలు దాడి చేస్తే వారిని ఏమీ అనకుండా పోలీసులు నిమ్మకున్నారని, ఏజెంటు లేకుండా ఎలా పోలింగ్ నిర్వహించాలని, ఉన్న ఏజెంట్లను పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంత వరకు సబబని కూటమి నేతలు ప్రశ్నించారు. వైసీపీ గూండాలు, రౌడీలకు పోలీసులు సెల్యూట్ చేయడం సిగ్గు చేటన్నారు. వైసీపీ నేతలకు పోలీసులు కొమ్ముకాచి కూటమి కార్యకర్తలు, ఏజెంట్లను ఇబ్బందికి గురి చేశారన్నారు. ఈ పోలింగ్ సమస్యాత్మకంగా ఉందని అధికారులకు తెలిసినా ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్య ఎదురైందని మహిళా ఓటర్లు అధికారులను నిలదీశారు. ఈ విషయమై రైల్వేకోడూరు ఎన్నికల అధికారి లీలారాణి వచ్చి ఆరా తీశారు. జిల్లా పోలీసు అదనపు అధికారి రాజ్‌కమల్ చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఎన్నికల అధికారులతో పోలీసులు చర్చించి మరో ఈవీఎంను తెప్పించి పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకున్నారు. పుల్లంపేట 183 పోలింగ్ కేంద్రంలో రెండు గంటల పాటు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వేకోడూరులోని హెచ్ఎంఎం హైస్కూలు లోని పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ రిగ్గింగుకు పాల్పడుతోందని కూటమి శ్రేణులకు సమాచారం అందడంతో కూటమి శ్రేణులు భారీగా స్కూలు వద్దకు చేరుకున్నారు. అంత కంటే ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో వైసీపీ శ్రేణులు భారీగా ఉండడంతో కూటమి శ్రేణులు వెళ్లి కేకలు పెట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయాన్ని రాజంపేట డీఎస్పీ చైతన్య ఇరువర్గాలకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. ఒకరి తర్వాత ఒకరిని బయటకు పంపే క్రమంలో టోల్గేట్ సమీపంలో ఇరు వర్గాలు రాళ్ల రువ్వుకున్నారు. దీంతో పోలీసు లు లాఠీ చేశారు. చిట్వేలి మండలం నాగవరం పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డి పై వైసీపీ మూకలు దాడి చేసి గాయపరిచారు. దీంతో చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో నాగార్జునరెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓబులవారిపల్లె మండలంలో చెదుముదురు సంఘటనలు జరిగాయి.

పెనగలూరు మండలం కొండూరు పోలింగ్ కేంద్రంలో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పోలీసులు వైసీపీ శ్రేణులకు అనుకూలంగా వ్యవహరించారని కూటమి నేతలు ఆరోపించారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు చంటి బిడ్డలను ఎత్తుకుని మహిళలు వచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, అభ్యర్థులు పోలింగ్ సరళిని పరిశీలించారు. చాలా పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 6 గంటలకు ఓటర్లు రావడం విశేషం.



తూర్పుపల్లెలో వృద్ధురాలిని ఓటింగ్‌కు తీసుకు వెళుతున్న గ్రామస్తులు - రాఘవరాజపురం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు - రైల్వేకోడూరులో చంటి బిడ్డలతో ఓటు వేసేందుకు

జమ్మలమడుగులో ఉద్రిక్త వాతావరణం

● సాయంత్రం వెంకటేశ్వర కాలనీ పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ

జమ్మలమడుగు, మే 13: వెంకటేశ్వర కాలనీ, ఈద్గా సమీప పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ జరిగింది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వారి శ్రేణులు పోలింగ్ బూత్ వద్దకు చేరుకుని ఓటర్లను ప్రభావితం చేస్తూ మాట్లాడుతున్నారని సమాచారం. దీంతో అక్కడికి టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి చేరుకున్నారు. అప్పటికే ఇరువర్గాలు రాళ్ల రువ్వుకున్నారు. డీఎస్పీ యశ్వంత్ కేంద్ర బలగాలు కార్యకర్తలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపించారు. దారిలో టీడీపీ శ్రేణుల వాహనం అద్దాలు పగులకొట్టారు. దీంతో అక్కడే ఉన్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మాటా మాటా పెంచినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఇరువర్గాలు పట్టణంలో ఉద్రిక్త వాతావరణంగా కార్యకర్తలు పార్టీ కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. వెంటనే డీఎస్పీ యశ్వంత్ టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, చివరి సమయంలో అనవసరంగా గొడవలు వద్దని ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డితో చెప్పడంతో ఆదినారాయణరెడ్డి కార్యకర్తలతో మాట్లాడి దేవగుడికి వెళ్లిపోయారు. ఏది ఏమైనా పట్టణంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో పోలీసు బలగాలు మోహరించాయి.

కరపత్రాల కలకలం



పోరుమామిళ్లలో కలకలం రేపిన కరపత్రాలు

పోరుమామిళ్ల, మే 13: పోరుమామిళ్లలో కరపత్రాల కలకలం వైరల్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఆర్టీసీ బస్టాండు వద్ద, మహాత్మాగాంధీ విగ్రహం, వెంకటేశ్వర జూనియర్ కళాశాల. సుందరయ్యకాలనీకి వెళ్లే దారి సహా చాలా ప్రాంతాల్లో చంద్రబాబుకు వ్యతిరేకంగా కొందరు కరపత్రాలు ముద్రించి పారవేశారు. బాబు అధికారంలోకి వస్తే పథకాలు రావంటూ ఆయనకు వ్యతిరేకంగా కర పత్రాలను ముద్రించి పారవేశారు. పథకాలు బాబు ఆపేస్తాడు, బాబు మళ్లీ వస్తే పథకాలు రద్దు, పించన్లు రద్దు, రిజర్వేషన్లు రద్దు అంటూ టీడీపీకి వ్యతిరేకంగా కరపత్రాలను అక్కడక్కడా జారవిడిచారు. ఎవరూ లేని సమయంలో కొందరు జారవిడిచారు. పంచాయతీ కార్యాయలం వద్ద ఉన్న కరపత్రాలను పోలీసు అధికారులు పంచాయతీ సిబ్బందిని పురమాయించి వాటిని కాల్పించారు. అయినా టీడీపీ అంటే ఓర్వలేని కొందరు దుష్ప్రచారం చేసేందుకు ఈ కరపత్రాలను ముద్రించి ప్రధాన ప్రాంతాల్లో జారవిడిచారు. ఆయన పదవిలో లేనప్పుడే ఇంత చేస్తే వస్తే గనుక పథకాలు బంద్ ఆంధ్ర ఓటరులాగా జాగ్రత్త అంటూ టీడీపీకి వ్యతిరేకంగా కరపత్రాలను అక్కడ పారవేశారు. కొందరు వైసీపీ వారు ఓటమి భయంతోనే ఇలా చేసి ఉంటారని ధైర్యంగా ఎదుర్కోలేక దొడ్డిదారిలో ఈ కరపత్రాలు జారవిడవడం ఏమిటంటూ శాపనార్థాలు పెట్టారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం, మే 13: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్య కైంకర్యాల అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయం మండపంలో పుష్పాలం కరణలతో తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. చివరగా హోమాలు గావించి కల్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఐడీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

చాపాడు, మే 13: సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. హసిఫా 553, యహిత్‌రెడ్డి 538, మహమ్మద్ అప్పాన్ 522, వెంకటహర్షవర్ధన్ 517 సాధించారన్నారు. మరో ఐదుగురు విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించినట్లు చెప్పారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి మొదటిస్థానాల్లో నిలవడం సంతోషకరమన్నారు. డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ పాఠశాల తొలి ఫలితాల నుంచే విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణమన్నారు.



షేక్ ఆసిఫా | యషితారెడ్డి | మహ్మద్ అఫాన్ | సాయి మహేశ్వరి | వెంకట హర్షవర్ధన్

ఓటు వినియోగించుకున్న అభ్యర్థులు, ప్రముఖులు



ఓటు వేస్తున్న కస్తూరి విశ్వనాథనాయుడు - ఓటు వేసిన టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, పంతగాని నరసింహప్రసాద్ కుటుంబీకులు

రైల్వేకోడూరు, మే 13: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా ఫ్యామిలి ఓటు ను వారి, వారి పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



నందలూరు, మే13: నాకినేనిపల్లె యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వక్కాకుల వెంకట ప్రసాద్ (28) సోమవారం తెల్లవారు జామున మృతుని ఇంటి సమీపంలో రోడ్డుపై మృతి చెందిపడి ఉండడంతో గ్రామస్తులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి శవపరీక్ష నిమి త్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.

వైసీపీ కవ్వింపు చర్యలున్నా ప్రశాంత పోలింగ్

ఓటమి భయమే కారణమంటున్న విశ్లేషకులు ● ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసుల చర్యలు

● సంయమనం పాటించిన వరదరాజుల రెడ్డి



కామనూరులో టీడీపీ కార్యకర్తలతో గొడవకు దిగుతున్న బంగారురెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి - పోలీసుల అదుపులో కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, టీడీపీ నేత నారాయణరెడ్డి, రామేశ్వరం హైస్కూల్ వద్ద వృద్ధురాలిని తీసుకొస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు మే 13: ప్రొద్దుటూరులో పోలింగ్ జరిగిన సరళిలో ఓటర్లు టీడీపీకి అనుకూలంగా మొగ్గుచూపుతున్నారన్న సమాచారంతో వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. దీంతో కొన్ని చోట్ల వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు దిగారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరుకు వైసీపీ నేత రాచమల్లు కిరణ్ రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి, బంగారు రెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లడంతో టీడీపీ నేతలు కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఏమైతే రాకూడదా అంటూ రెచ్చగొట్టేలా వీరు ఇద్దరు కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో అక్కడే వున్న పోలీసులు వారి ఇద్దరిని పోలింగ్ బూత్ నుంచి తీసుకెళ్లి కారు ఎక్కించి అక్కడి నుంచి పంపించి వేశారు.

దొరసానిపల్లెలో మాజీ మహిళా వలంటీర్లు ముగ్గురు కొందరు వృద్ధులను ఇంటి నుంచి తీసుకొచ్చి బూత్‌ల వద్ద ఓట్లు వేయిస్తుంటే టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేత లక్ష్మీనారాయణ రెడ్డి టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగి దౌర్జన్యానికి తెగబడ్డారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది.

4 వవార్డు గౌతమ్ స్కూల్ బూత్ వద్ద 3వ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీవుండగా 4 వ వార్డు వైసీపీ కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి ఆమెను అసభ్యంగా దూషించినట్లు ఆమె వివరించింది. ఆమె అక్కడే విధుల్లో వున్న సీఐ వెంకట రమణకు తెలిపింది. దీంతో సీఐ ఓబులరెడ్డిని అక్కడి నుంచి పంపిస్తూ ఆమెను బూత్ నుంచి పంపించేశారు.

ఖాదర్ హుస్సేన్ మసీదు వీధి బూత్‌లో వైసీపీ కార్యకర్త హల్‌చెల్ చేయడంతో 22 వవార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్ వర్గం అభ్యంతరం పెట్టారు. దీనిపై వైసీపీ కార్యకర్తలు బూత్‌వద్ద గుంపులుగా చేసి దౌర్జన్య చర్యలకు దిగే ప్రయత్నంలో ఎస్ఐ హైమావతి వారిని అక్కడి నుంచి చెదరగొట్టింది.

బూత్ వద్ద వైసీపీ వర్గం దొంగ ఓట్లు వేసుకోకుండా అక్కడే వున్న వైసీపీ నుంచి టీడీపీ చేరిన కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, టీడీపీ నేత వంగల నారాయణరెడ్డిని అరెస్టు చేసి త్రీటౌన్ సీఐ వెంకట రమణ స్టేషన్‌కు తరలించారు. వైసీపీ నేతలను మాత్రం స్టేషన్‌కు తీసుకురాకపోవడం పై వారు సీఐని నిలదీశారు.

మోడంపల్లెలో టీడీపీ కార్యకర్తపై టూటౌన్ సీఐ కరీం చేయిచేసుకున్నారు. ఈ విషయం టీడీపీ నేతల దృష్టికి రావడంతో సీఐని వరదరాజులరెడ్డి ప్రశ్నించారు.

సాయంత్రం పోలింగ్ ముగిసే సమయంలో కొశెట్టిహైస్కూల్‌లో పోలింగ్‌ను పర్యవేక్షించడానికి వచ్చి ఆవరణలో టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి కూర్చున్నారు. అక్కడ సిబ్బంది టీ ఇస్తే తాగుతూ వుండగా వైసీపీ అభ్యర్థి రాచమల్లుకు సమాచారం చేరడంతో ఆయన చేరుకుని బూత్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. దీంతో వరదరాజులరెడ్డి డీఎస్పీకి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆయనను బయటికి పంపించేశారు. దీంతో వరదరాజులరెడ్డిని కూడా పంపించమని రాచమల్లు పోలీసులను ప్రశ్నించారు. మీరు వెళ్లిన వెంటనే వరదరాజుల రెడ్డిని కూడా పంపిస్తామని ఇద్దరు ఒకే సారి వెళితే ఘర్షణలు జరుగుతాయని పోలీసులు వెళ్ళడించారు. కొశెట్టి స్కూలు నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్ద వరదరాజులరెడ్డి యూటర్న్ తీసుకుంటుండగా రాచమల్లు కిరణ్‌రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి, బంగారెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి వంద మంది యువకులను గుంపుగా పెట్టుకుని కేకలు వేశారు. వరదరాజులరెడ్డితో కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో వరదరాజులరెడ్డి మనుషులు దిగుతుండగా అక్కడే వున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు వైసీపీ యువకుల గుంపును చెదర గొట్టారు. దీనిని బట్టి వైసీపీ నేతలకు ప్రొద్దుటూరులో ఓటమి భయంతో అడుగడుగునా కవ్వింపు చర్యలకు పాల్పడేందుకు యత్నించారు. అయితే పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకుని ఘర్షణలు నివారించే ప్రయత్నం చేశారు,

ఈవీఎంల మొరాయింపు

ప్రొద్దుటూరులో ఉదయం కొన్ని పోలింగ్‌బూత్‌లలో ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఈవీఎంలు మొరాయించడంతో కొంత సమయం ఆలస్య మైంది. వెదుర్ల బజార్‌లోని పోలింగ్ బూత్ రామేశ్వరం ప్రైమరీ స్కూలు బూత్‌లో చెన్నమరాజుపల్లె బూత్‌లలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించే సరికి వాటని టెక్నికల్ సిబ్బందిని పిలిపించి సరిచేశారు. దీంతో కొంత సమయం పోలింగ్ ఆలస్యమైంది.

పోలింగ్ సరళి పర్యవేక్షించిన అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల ఘట్టం సోమవారం ఉదయం 5 గంట నుంచే పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభమైంది. ఉయాన్నే 5 గంటలకు ఏజంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏజంటు ఫారాలను పోలింగ్ అధికారులను అప్పగించారు. ఏజంట్లను బూత్‌లలో కూర్చోపెట్టి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులు తీరారు. సరిగ్గా 7గంటలకు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు ప్రారంభించారు. పురుషులు మహిళలు యువకులు పెద్ద ఎత్తున క్యూలైన్‌లో నిలబడ్డారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు వికలాంగులు వీల్ చైర్‌లలో వచ్చి ఓటు వేశారు. 95 ఏళ్ళు నిండిన సీనియర్ అడ్వకేట్ సింగం రెడ్డి క్రిష్టారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పటిష్ట బందోబస్తు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే రాచముల్ల ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డి వుండే ఏరియాలైన రామేశ్వరం వసంతపేటలలో వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ ఎస్ఐ హైమావతి పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాలను తిరుగుతూ పర్యవేక్షించారు. డీఎస్పీ మురళీధర్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఉదయం నుంచే టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వరదరాజులరెడ్డి, రాచమల్లు ప్రసాద్ రెడ్డి పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

రాత్రి 9 వరకు సాగిన పోలింగ్

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రొద్దుటూరు మున్సిలిటీ, ప్రొద్దుటూరు మండలం, రాజుపాలెం మండలం ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే క్యూ కట్టారు. మొత్తం నియోజకవర్గంలో 2,47,966 ఓటర్లువుండగా అందులో పురుషులు 1,19,985 స్త్రీలు 1,27,933 ,ఇతరులు 48 వున్నారు. పురుషులకంటే స్త్రీలు 7,948 మంది అధికంగా వున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తంలో మహిళలు సైతం ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 78 శాతం ఓటు హక్కును వినియోగించుకోగ ఈ ఎన్నికల్లో 85 శాతం పైగా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. రాత్రి 10 గంటల సమయానికి 80 శాతం లెక్క తేలినట్టు వెల్లడిస్తున్నారు.



లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు - మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఓటర్లుకు సూచనలిస్తున్న డీఎస్పీ మురళీధర్

చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

కమలాపురం రూరల్ మే 13 : కమలాపురం మండలంలో సాధారణ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. కొన్నిచోట్ల ఈవీయంలు నిదానంగా పనిచేసినా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది జరగలేదు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి తమ కుటుబ సభ్యులతో మాచిరెడ్డిపల్లెలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి నగర పంచాయతీ పరిధిలో 27వ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీటి వసతి, నీడ కల్పించారు. అదే విధంగా ఎండాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులుకు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యేఅభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాదరెడ్డి మండలంలోని ప్రతిప ఓలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న ఓటింగ్ సరళి ని పరిశీలించు.ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు.

కోగటంలో స్వల్ప ఉద్రిక్తత

మండల పరిధిలోని కోగటం గ్రామంలో ఉదయం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, వైసీపీ నాయకుడి మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది సోమవారం ఉదయం ఎన్నిల సందర్భంగా చైతన్యరెడ్డి కోగటం గ్రామంలో ఏజెంట్లను ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. దాన్ని గమనించిన వైసీపీ నాయకుడు కరుణ్‌రెడ్డి అక్కడికి చేరుకుని పోలింగ్ బూత్‌లో మీకు పనేందంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎక్కడికైనా పోయే హక్కు నాకుందంటూ పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ సుధాకర్ హుటాహుటిన కోగటం గ్రామం చేరుకుని ఇద్దరితో మాట్లాడి సర్ది చెప్పి పంపించారు. ఈ సందర్భంలో పుత్తా చైత్యన్యరెడ్డికి సంబంధించిన ఒక వాహనాన్ని కరుణ్‌రెడ్డి ఇంటి ముందు నిలిపారు. దీంతో కరుణ్‌రెడ్డి ఆ వాహనంపై రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. డ్రైవరు అప్రమత్తం కావడంతో వాహనానికి ఎలాంటి డ్యా మేజీ కాలేదు. ఆ గ్రామంలో ఘర్షణ వాతవరణం చోటు చేసుకోకుండా ఏఎస్పీ లోసారి సుధాకర్, డీఎస్పీ సుధాకర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల సందర్భంగా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మండల పరిధిలోని పెద్దచెప్పలిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ సరళని పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తుచేయాలని ఎస్ఐ, సీఐలకు సూచించారు.

వల్లూరులో...

మండల వ్యాప్తంగా 28 బూత్‌లలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిసినట్లు తహసీల్దారు తెలిపారు. ఉదయాన్నే పైడికాల్వ గ్రామంలో ఈవీఎంలు గంట సేపు మొరాయించాయని, అనంతరం అధికారులు స్పందించి వెంటనే పోలింగ్ మొదలుపెట్టారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఓటింగ్ సరళి ప్రశాంతంగా ముగిసింది. టీడీపీ అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి పెద్దపుత్తలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన సోదరుడు సాయినరసింహారెడ్డి వల్లూరు జడ్పీ హైస్కూలులో జరుగుతున్న ఓటింగ్‌ను పరిశీలించారు. ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగకండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. ఓటర్లు ఉదయం 6 గంటల నుంచే తమ ఓటు హక్కును వినియోగించేందుకు బారులు తీరారు. పోలీసులు స్థానిక ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షించారు. వృద్ధులు, యువకులు, పోటీ పడి తమ ఓటు హక్కు వినియోగించడంలో ముందున్నారు.



కడప నగరంలో ఓటు వేసేందుక పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్న జనం

టీడీపీ, బీజేపీ ఏజెంట్లపై వైసీపీ దాడి

వేంపల్లె, మే 13: వేంపల్లెలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నాయకులు టీడీపీ, బీజేపీ ఏజంట్లపై దాడులు చేశారు. ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించి ఒప్పుకోకపోవడంతో ఈ దాడి చేశారు. వేంపల్లెలోని బిడాలమిట్ట పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నాం ఈ ఘర్షణ చోటుచేసుకుంది. అక్కడ ఏజెంట్‌గా కూర్చున్న పసుపులేటి వీరభద్రను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. వినకపోవడంతో వైసీపీ నాయకులు వీరభద్రపై కొట్టుకుంటూ నెట్టివేశారు. పక్కబూత్‌లో ఉన్న బీజేపీ ఏజెంట్ గాలి హరిప్రసాద్ ఇదేం అన్యాయమని ప్రశ్నించగా ఆయనపై దాడి చేశారు. అక్కడున్న పోలీసులు జోక్యం చేసుకొని అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వేంపల్లె మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి ఇతర నాయకులు బిడాలమిట్ట బూత్ వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు టీడీపీ నాయకుల కారుపై దాడి చేసేందుకు చుట్టుముట్టారు. ఈలోపు సీఐ చాంద్‌బాష ఘటన స్థలానికి చేరుకొని వైసీపీ కార్యకర్తలను తరమిగొట్టారు.

సైక్లింగ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్

వేంపల్లెలోని మార్కెట్‌లో ఉన్న 242 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 4గంటల ప్రాంతంలో వైసీపీ నాయకులు సైక్లింగ్ చేసేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రహంతుల్లా బూత్ వద్దకెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. సైక్లింగ్ జరగకుండా అడ్డుకున్నారు. ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంటుండడంతో డీఎస్పీ వినోద్‌కుమార్ అక్కడకు చేరుకొని ఇరువర్గాలను పంపించి పోలింగ్‌ను యదావిధిగా జరిపించారు. మండలంలో 62 పోలింగ్ బూత్‌లలో 45255 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా సుమారు మండల వ్యాప్తంగా 80శాతం ఓట్లు పోలైనట్లు సమాచారం.

ఏజెంట్‌గా కూర్చున్నారనే అక్కసుతో ఘర్షణ

వేంపల్లె మండలం అమ్మగారిపల్లెలో టీడీపీ తరపున ఏజెంట్‌గా కూర్చున్నారనే అక్కసుతో ఏజెంట్, ఏజెంట్ తల్లిపై వైసీపీ నాయకులు దాడికి దిగారు. ఎన్నికలు పూర్తై ఈవీఎంలను ఉద్యోగులు బస్సులోకి తీసుకెళ్తుండగా వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్ శివనాగమునిరెడ్డి తదితరులను దుర్భాషలాడారు. ఏజెంట్ కూర్చునే మగాళ్లా అంటూ వైసీపీ నాయకులు దాడికి దిగారు. ఈ ఘర్షణలో శివనాగమునిరెడ్డి తల్లి గంగాదేవికి గాయాలయ్యాయి.వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. దాడి విషయాన్ని సీఐ చాంద్‌బాషకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

సీకేదిన్నెలో ప్రశాంతంగా ఓటింగ్

సీకేదిన్నె, మే 13: చింతకొమ్మదిన్నె మండలంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ పక్రియ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం నుంచే క్యూలైన్‌లో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జె.కొత్తపల్లె, పెద్దకాంపల్లె, నాగిరెడ్డిపల్లె, బీఎస్.తాండా, కమ్మవారిపల్లి పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ లేటుగా ముగిసింది.

ఓటింగ్‌ను పరిశీలించిన భూపేష్

వేంపల్లె, మే 13: వేంపల్లెలో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. వేంపల్లెలోని మెయిన్ బజార్‌లోని మెయిన్ స్కూల్లో పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆయన సతీమణి అలివేలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే పోలింగ్ బూత్‌లో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా వేంపల్లెలో జరుగుతున్న పోలింగ్ సరళిని కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పరిశీలించారు.

పెండ్లిమర్రిలో పోలింగ్ ప్రశాంతం

పెండ్లిమర్రి, మే 13: మండలంలోని 19గ్రామ పంచాయతీలలో ఉన్న 44పోలింగ్ కేంద్రాలలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఒక్క పాత సంగటిపల్లె గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్నారు. రంపతాడు పంచాయతీలో 155పోలింగ్ కేంద్రంలో, జిసిపల్లె పంచాయతీలో 183వ పోలింగ్ కేంద్రంలోను, పెండ్లిమర్రి పంచాయతీలోని 182 పోలింగ్ కేంద్రంలో గంటపాటు ఈవీఎంలు

చెన్నూరులో...

సార్వత్రిక ఎన్నికల్లో చెన్నూరు మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 31,052 మంది ఓటర్లకు గాను 25656 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 82.62 శాతం పోలింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా మొత్తం 36 పోలింగ్ కేద్రాల్లో దయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ చిన్నపాటి కొద్దిగా ఆలస్యమై సాయంత్రం6 వరకు జరిగింది.

ఎన్నికల సరళిని పరిశీలించిన రాష్ట్ర అబ్జర్వర్

పులివెందుల టౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పోలింగ్‌శాతం నమోదైంది. ఉదయం 7గంటల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలంలో చిన్నపాటి ఘర్షణ తప్ప ఎటువం టి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పులివెందులలోని పోలింగ్ కేం ద్రాలను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కునాల్ సిల్క్ పరిశీలించారు. పోలింగ్ అధికారులతో మాట్లాడుతూ గుంపులు గుంపులుగా ఎవరిని కూడా పోలింగ్ కేంద్రాలలో అనుమతించవద్దని ఏజెంట్లను కూడా గుంపులుగా ఉంచకుండా పరిమిత సంఖ్యలోనే అనుమతులు ఇవ్వాలని బూత్‌ల నందు ఏవైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడుతుందని సూచించారు.



పోలింగ్ సరళిని పరిశీలించి బూత్ అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కునాల్ సిల్క్

కడపలో నగరంలో...

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- మండుటెండల్లో సైతం ఓటర్లు పడిగాపులు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్



ఓటు కోసం బారులు తీరిన జనం

కడప (క్రైం), మే 13 : కడప నగరంలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. అక్కడక్కడా ఈవీయం మిషన్‌లు మొరాయించినప్పటికీ మళ్లీయ దావిధిగా కొనసాగాయి. బూత్ నెం.29 రామరాజుపల్లెలో 7.10 ఏదైనా ప్రారంభం కాకపోవడంతో జనాలు బారులు తీరారు.పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. వంద మీటర్ల పరిధిలో ఎవరూ ఉండకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు. సిద్దార్థకౌశల్ ఆధ్వర్యంలో ఏపీ పోలీసులతో పాటు తమిళనాడు, గుజరాత్ చెందిన పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకండా షామియానాలు ఏర్పాటు చేశారు. ఎండలో నిల్చున్న ఓటర్లు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి తన భర్త శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఓటు హక్కును వినియోగించుకుది. కడప మేకలదొడ్డి ప్రాంతంలో కొందరు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. ఇది చిత్రీకరిస్తున్న ఓ యువకుడిని చితకబాదడంతో అతను కడపలోని సెవెన్‌రోడ్స్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కడప నగరంలో చ్నిన్న చిన్న సంఘటనలు మినహాయిస్తే పెద్దఘటనలు జరగలేదు.

శభాష్ పోలీస్

కడపనగరంలోని ఓ దివ్యాంగుడు పోలింగ్ బూత్‌లకు వెళ్లలేక అవస్థలు పడుతుంటే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఒక కానిస్టేబుల్ ఆమెను ఎత్తుకుని కడప నగరం గూడూరు హరిజనవాడ ప్రాధమికపాఠశాల పోలింగ్‌బూత్ నెం.122లోని పోలింగ్‌బూత్‌లోకి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను తిరిగి ఎత్తుకుని రావడంతో అక్కడున్న వారు శభాష్ పోలీస్ అంటూ అభినందనలు తెలిపారు.

చెన్నూరులో టీడీపీ నేతల ఆనందోత్సాహాలు

చెన్నూరు, మే 13: గతంలో జరిగిన ఎన్నికల్లో 36 పోలింగ్ కేంద్రాల్లో చాల వరకు ఓటర్లు వేసిన ఓట్లలో వారితో మాట్లాడితే టీడీపీ వైపు మొగ్గు చూపినట్లు చెప్పడం జరిగింది ముఖ్యంగా టీడీపీ మేనిఫెస్టోలోని పెన్షన్, ల్యాండ్ టైటలింగ్‌యాక్టు రద్దు ప్రధానంగా ప్రజలు చర్చించుకోడం జరిగింది. అంతేకాక కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేసిన షర్మిలాకు కూడా ఓటర్లు మొగ్గు చూపారు. అంతేకాక ఎంపీ అభ్యర్థి విషయానికి వస్తే టీడీపీ తరువాత షర్మిలా పేరే ఎక్కువ ప్రస్తావనకు వచ్చింది. పైగా పలువురు వైసీపీ మద్దతుదారులు వైసీపీకి ఇప్పటి వరకు ప్రచార కార్యకర్తలుగా పనిచేసిన వారు సైతం జరిగిన పోలింగ్‌లో ఆ పార్టీపై కాస్త విముఖత వ్యక్తం చేశారు. మొత్తం మీద చెన్నూరు మండలంలో టీడీపీకే మెజార్టీ వచ్చే సూచనలు జరిగిన పోలింగ్ బట్టి స్పష్టంగా తెలుస్తుంది. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి మండల వ్యాప్తంగా ఎన్నికల సమయంలో పడ్డ కష్టం ఉమండలంలోని అందరు టీడీపీ నేతలు, గ్రామస్థాయి నేతలు పడ్డ కష్టం విసనత్తత ప్రచారాలు, మేనిఫెస్టో వివరించడంలాంటివి టీడీపీమెజార్టీకి దోహదపడ్డాయని చెప్పుకోవడం జరుగుతుంది.



ఓటు వేసేందుకు వెళుతున్న జనం









వేంపల్లెలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న భూపేష్‌రెడ్డి...పెద్దపుత్తలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న టీడీపీ అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి... 17వ పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు నమస్కరిస్తున్న పుత్తా నరసింహారెడ్డి... ఓటేయడానికి వెళుతున్న వృద్ధురాలు

పులివెందులలో 80 శాతంపైగా పోలింగ్ నమోదు

- 80.18శాతం పోలింగ్ నమోదు

పులివెందుల, మే 13: పులివెందుల నియోజకవర్గంలో చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సోమవారం ఉదయం 6.30 గంటల ప్రాంతం నుంచి ఓటర్లు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మాక్‌పోలింగ్ కూడా పూర్తికాకముందు నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. మధ్యాహ్నాం ఎండవేడిమికి, సాయంత్రం చిరుజల్లులు పడుతున్న క్యూలైన్లలో నిలబడి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ రెండుస్థానాలకు ఓటర్లు వారి ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగాల్సిన పోలింగ్ కొన్నిచోట్ల రాత్రి 8.30గంటల వరకు ఓటింగ్ సాగింది. ఓటర్లు పెద్దఎత్తున తరలివచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకోవడంతో 80.18శాతం పోలింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 7.30గంటల ప్రాంతంలో తన ఇంటి నుంచి బాకరాపురంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి కుటుంబ సమేతంగా చేరుకున్నారు. అక్కడ సీఎం జగన్ సతీమణి భారతి, కుమార్తె వర్షలతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 7.40గంటల ప్రాంతంలో మీడియాతో మాట్లాడారు. తన ప్రభుత్వంలో మంచి జరిగిన వారు మళ్లీ వైసీపీని ఆదరించాలని అభ్యర్థించారు. అనంతరం 8గంటల ప్రాంతంలో హెలికాప్టర్ ద్వారా బయలుదేరి తాడేపల్లెకు వెళ్లారు. కడప ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన వైఎస్ షర్మిల ఉదయం 9.30గంటల ప్రాంతంలో వేంపల్లె మండలం ఇడుపులపాయలోని మల్లేలమ్మ పోలింగ్ కేంద్రం వద్ద తన భర్త బ్రదర్ అనిల్‌తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పులివెందులకు వచ్చి పులివెందులలో వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యమ్మను కలిసి పరామర్శించారు. అనంతరం రవణప్పసత్రం బడిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అక్కడి నుంచి సరస్వతి విద్యామందిరంలోని పోలింగ్ కేంద్రన్ని పరిశీలించారు. అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గానికి వెళ్లారు. టీడీపీ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి ఆయన స్వగ్రామమైన సింహాద్రిపురం మండలంలోని కసనూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీటెక్ రవి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. ఎక్కడ తమ ఏజంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు బీటెక్ రవి చూసుకున్నారు. అదే మండలంలోని కాంబల్లెలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. బాకరాపురంలోని పోలింగ్ కేంద్రంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, తండ్రి భాస్కర్‌రెడ్డి, తల్లి లక్ష్మి, సతీమణి సమత ఓటు హక్కు వినియోగించుకున్నారు.




లింగాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

చెదురుమదురు సంఘటనలు

పులివెందుల నియోజకవర్గలో జరిగిన పోలింగ్‌లో వే ముల మండలంలోని మబ్బుచింతలపల్లె గ్రామంలో ఏజెంట్ ఓటర్‌ను ప్రభావితం చేస్తున్నాని ఒకరికొకరు కేకలు వేసుకొని రాళ్లదాడులకు దిగారు. ఈ రాళ్లదాడులకు దిగిన ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం యదావిధిగా పోలింగ్ ప్రారంభమైంది. అలాగే వేంపల్లెలోని బిడాలమిట్ట పోలింగ్ కేంద్రంలో అక్కడ ఏజెంట్‌గా కూర్చున్న పసుపులేటి వీరభద్రను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. వినకపోవడంతో వైసీపీ నాయకులు వీరభద్రపై కొట్టుకుంటూ నెట్టివేశారు. పక్కబూత్‌లో ఉన్న బీజేపీ ఏజెంట్ గాలి హరిప్రసాద్ ఇదేం అన్యాయమని ప్రశ్నించగా ఆయనపై దాడి చేశారు.వేంపల్లెలోని మార్కెట్‌లో ఉన్న 242 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 4గంటల ప్రాంతంలో వైసీపీ నాయకులు సైక్లింగ్ చేసేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రహంతుల్లా బూత్ వద్దకెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. సైక్లింగ్ జరగకుండా అడ్డుకున్నారు. ఘ ర్షణ వాతావరణం చోటుచేసుకుంటుండడంతో డీఎస్పీ వినోద్‌కుమార్ అక్కడకు చేరుకొని ఇరువర్గాలను పం పించి పోలింగ్‌ను యదావిధిగా జరిపించారు.వేంపల్లె మండలం అమ్మగారిపల్లెలో టీడీపీ తరఫున ఏజెంట్‌గా కూర్చున్నారనే అక్కసుతో ఏజెంట్, ఏజెంట్ తల్లిపై వైసీపీ నాయకులు దాడికి దిగారు. ఎన్నికలు పూర్తై ఈవీఎంలను ఉద్యోగులు బస్సులోకి తీసుకెళ్తుండగా వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్ శివనాగమునిరెడ్డి తదితరులను దుర్భాషలాడారు. పులివెందుల పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, రవణప్ప సత్రం బడి తదితర ప్రాంతాలలో సైక్లింగ్‌కు వైసీపీ ప్రయత్నించింది ఎప్పటికప్పుడు టీడీపీ నాయకుల నుంచి ప్రతిఘటనలు ఎదురవడంతో పోలీసులు పరిస్థితులను అదుపులోకి తెచ్చారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఏజెంట్ విషయమై కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలలీసులు రంగప్రవేశం చేయడంతో యదావిధిగా పోలింగ్ జరిగింది. అయినా కొన్ని పోలింగ్ కేంద్రాలలో సైక్లింగ్ జరిగినట్లు పలువురు నాయకులు ఆరోపించారు. తొండూరు, చక్రయపేట, సింహాద్రిపురం, లింగాల మండలాల్లో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేశారు. కాగా చక్రాయపేట మండల కేంద్రంలో వైసీపీ మండల ఇన్‌చార్జ్ వైఎస్ కొండారెడ్డి ఏజెంట్ల విషయంలో దురుసుగా ప్రవర్తించారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో వైఎస్ కొండారెడ్డి చక్రాయపేటలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. వెళ్లీవెళ్లగానే టీడీపీ ఏజెంట్లు ఎవర్రా.. బయటికి రాండని దుర్భాషలాడారు. దీంతో టీడీపీ ఏజెంట్లు ఎదురుదాడికి దిగారు. పరిస్థితి అదుపుతప్పుతున్న సమయంలో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అక్కడ నుంచి వెళుతున్న కొండారెడ్డి వాహనాన్ని పోలింగ్ కేంద్రానికి కాస్త దూరంలో యువకులు వాహనాన్ని ఆపి దేనికైనా సిద్ధం.. అంటూ దాడికి దిగారు. దీంతో కొండారెడ్డి వాహనం నుంచి దిగకుండా అలాగే ఉండిపోయారు. చివరికి పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి పంపించేశారు. అలాగే నాగులగుట్టపల్లెలో టీడీపీ, వైసీపీ ఏజెంట్ల మధ్య మాటామాటా పెరిగడంతో పోలీసులు సర్దిచెప్పారు.



కసనూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి



కాంబల్లెలో ఓటు వేసిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



వీఎన్‌పల్లె: ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న పుత్తా

వేములలో ప్రశాంతంగా పోలింగ్

వేముల, మే 13: మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని మబ్బుచింతలపల్లెలో స్వల్ప ఘర్షణలు కానీ, వాదులాటలు గాని లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరగడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పోలీసులు అధికారులు పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తూ పోలింగ్ ప్రశాంతగా నిర్వహించారు. ఉదయం నుంచే క్యూలైన్లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిలబడ్డారు. వేముల పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల, టీడీపీ ఎమ్మె ల్యే అభ్యర్థి బీటెక్ రవిలు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

వీరపునాయునిపల్లె, మే 13: మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 6గంటల నుంచే ఓటర్లు క్యూలైన్లలో నిలబడ్డారు. బసిరెడ్డిపల్లెలో చిన్నపాటి ఘర్షణ జరిగింది. పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఎన్.పాలగిరి, ఉరుటూరు, వీఎన్‌పల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి సందర్శించారు. ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె పోలింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ సందర్శించారు.

రాజంపేటలో టీడీపీ విజయం తథ్యం

ఒంటిమిట్ట, 13: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం విజయం తథ్య మని టీడీపీ సీనియర్ నాయ కులు మోదుగుల పెంచలయ్య, కొమరా వెంకట నరసయ్య, పామూరు సుబ్ర మణ్యం అన్నారు. వైసీపీ పతనం ప్రారంభమైందని జూన్ 4న టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. రాజంపేట ఆరు మండలాల్లో టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంకు మెజారిటీ వస్తుందని, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట నియోజకవర్గంలో మెజారిటీ రావడం ఖాయ మన్నారు. వైసీపీ అరాచక పాలనలో యువత, నిరు ద్యోగులు, వ్యాపారులు, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిట్వేలిలో సాయంత్రం ఆరైనా కొనసాగిన పోలింగ్

చిట్వేలి, మే 13:చిట్వేలి మండలంలోని. రాజుకుంట, వెంకటరాజుపల్లి, సి.కందులవారి పల్లె పోలింగ్ బూత్‌లలో సాయంత్రం ఆరు తరువాత కూడా పోలింగ్ సాగింది. సి.కందులవారిపల్లెలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. 15 నిమిషాల పాటు పోలింగ్ ప్రక్రియ నిలిపివేశారు. నాగవరం బూత్‌లలో బీజేపీ ఏజెంట్‌పై వైసీపీ నాయ కులు దాడి చేశారు. ఈ ఘటనలో బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డికి గాయాలయ్యాయి. ఈ విషయమై బీజేపీ ఇన్‌చార్జి చంగల్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిగిలిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సాఫీగా సాగింది.

'రాయచోటి కోటపై టీడీపీ జెండా ఎగరేస్తాం'

రాయచోటిటౌన్, మే13: రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీనేనని, రాయచోటి కోటపై కూడా టీడీపీ జెండా ఎగురేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని దప్పేదారిపల్లెలో ఓటు హక్కును విని యోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీపై మొగ్గు చూపుతు న్నారని, తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షి ్తూ మార్పు కోరుకుంటున్నారన్నారు. వైసీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతల అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి అనేది కనిపించ లేదన్నారు. వైసీపీ అరాచకాలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తి తో రగిలిపోతూ ఓటు రూపంలో తమ నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

జమ్మలమడుగు, మే 13: జమ్మలమడుగులో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నపాటి ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కన్నెలూరు గ్రామంలో వైసీపీ, ఎన్డీయే కూటమి నేతలు పోలింగ్ కేంద్రం వద్దకు రాగానే కొందరు ఓటర్లకు గుర్తు చెప్పి పంపిస్తున్నారని మాటా మాటా పెరిగింది. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని జనాలను, గుంపులను చెదరగొట్టారు. అలాగే జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని రామిరెడ్డిపల్లెలో పోలింగ్ కేంద్రం వద్ద గొడవ చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆ ప్రాంతానికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి చేరుకున్నారు. సమస్య సద్దుమణిగింది. అయితే సుమారు 7.30 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం 4 గంటల నుంచి అరగంటపాటు వర్షం కురిసింది. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ పక్రియ ఆలస్యమైంది. కాగా దేవగుడి గ్రామంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోరుమామిళ్ల..: ఒకటి రెండు సంఘటనలు మినహా పోరుమామిళ్ల మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం పోరుమామిళ్ల మండలంలోని 59 పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. పోరుమామిళ్లలోని 61వ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితాను వైసీపీకి చెందిన వారు బయటికి తీసుకురావడంతో టీడీపీ వారు అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్దిసేపు ఆ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పరస్పరం టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య తోపులాట జరిగింది. చివరికి పోలీసు అధికారుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది. రంగసముద్రం పంచాయతీ పరిధిలో రాజీనామా చేసిన ఓ వలంటీరు టీడీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం వద్ద కు వస్తుండడంతో వారిని అక్కడ నుంచి వెళ్లిపొమ్మని హుకుం జారీ చేశారు. దీంతో వారు నీకు ఏ అధికారం ఉందని మాకు చెబుతు న్నావంటూ ప్రశ్నించగా ఇరువర్గాల వారు వాదనలకు దిగారు. ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోరుమామిళ్లలోని 55వ పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే శివరామనందసరస్వతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే గోవింద రెడ్డి కుటుంబీకులు కూడా పోరుమామిళ్లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కలసపాడు..: మండల వ్యాప్తంగా సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో దాదాపు 85 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుంచే పోలిం గ్ పెద్ద సంఖ్యలో ఓటర్లు హాజరై తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మైలవరం..: ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. కల్లుట్ల, నార్జాంపల్లిలో ఈవీఎంలలో మొరాయించడంతో ఆలస్యం అయినా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుని ఓటింగ్ జరిపించారు. సాయంత్రం 6 గంటలైనా వద్దిరాల, తొర్రివేముల పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలైన్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బ్రహ్మంగారిమఠం..: ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం కొద్దిసేపు ఈవీయంలు మొరా యించడంతో గంట పాటు పోలింగ్ ఆలస్యంగా ఆగిపోయి తిరిగి కొనసాగింది. డి.నేలటూరు గ్రామంలో గాలివాన వర్షానికి విద్యుత్ పోవడంతో సాయంత్రం 5గంటల సమయంలో ఈవీయంలు మొరా యించాయి అక్కడ పోలింగ్8గంటల వరకు కొనసాగింది. అలాగే చెంచయ్యగారిపల్లె, చౌదరివారిపల్లె పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8గంలవరకు పోలింగ్ కొనసాగింది. కాగా మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ తన సొంత గ్రామమైన కొత్తపల్లెలో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా మధ్యాహ్నం నుంచి పోలింగ్ శాతం పెరిగింది. వృద్ధులతోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చారు.

ముద్దనూరు..: మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నల్లబల్లె గ్రామంలో పోలింగ్ సరళిని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి పరిశీలించారు. అలాగే ముద్దనూరు ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిలారెడ్డి పరిశీలించారు. కొర్రపాడు గ్రామంలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ఆలస్యం అయింది.మండలంలో 87.79 శాతం పోల్ అయినట్లు అధికారులు తెలిపారు.

కొండాపురం...: మండలంలో 84.61 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.శ్రీనివాసులు తెలిపారు. కొండాపురం పట్టణంలో మాత్రమే 72 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 84.61 శాతం పైగా పోలింగ్ నమోదయింది. తాళ్లప్రొద్దుటూరు,దత్తాపురం పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8.00 గంటల దాకా పోలింగ్ జరిగింది .దత్తాపురం, తిరుమలాయపల్లె తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమయింది. ముచ్చు మర్రి, దత్తాపురం తదితర చోట్ల స్వల్ప వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

బద్వేలు/బద్వేలుటౌన్..: బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో చెదురుమొదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు , పోలింగ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని మండలాలో ఈవీఎం లు మొరాయించడంతో కలసపాడు, కాశినాయన మండలాలలో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రఘునాథపురం, లక్ష్మీపాళెం, అట్లూరు, బద్వేలు పట్టణాలలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అక్కడ పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. ఇన్‌చార్జి డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. చెన్నకేశంపల్లె వద్ద టీడీపీ, వైసీపీ నేతల మధ్య చిన్న వాగ్వాదం చోటు చేసు కుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో సమ స్య సద్దుమణిగింది. బద్వేలు పట్టణంలో ఎస్సీ హాస్టల్ పోలింగ్ కేంద్రం వైసీపీ నేతలు ఓటర్లకు డబ్బులు పంపిణీచేస్తుండగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఇరు వర్గాలు వాగ్వాదం చేసుకున్న సమయంలో పోలీసులు రావడంతో సమస్య సద్దుమణిగింది.

కాశినాయన..: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.27 పోలింగ్ కేంద్రాలకుగాను మిద్దెల,రెడ్డికొట్టాల మినహా మిగిలిని కేంద్రాల్లో ఎన్నికలు నిర్దేశిత సమయంలోనే పూర్తయ్యాయి.గంగనపల్లె పోలింగ్ కేంద్రం లో ఉదయం ఈవీఎం మొరాయించడంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. రెడ్డికొట్టాల పోలింగ్ కేంద్రంలో మధ్యమధ్యలో ఈవీఎంలు మొరాయిస్తూ ఉండటంతో రాత్రి 8గం వరకు ఓటింగ్ పక్రియను అధికారులు కొనసాగించారు. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆకుల నారాయణపల్లె, వరికుంట్ల, గొంటువారి పల్లె,మిద్దెల,నర్సాపురం, ఓబుళాపురం తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండలంలో చిన్నపాటి రాళ్లరువ్వుకున్న సంఘటన మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాగా పోట్లదుర్తిలో సీఎంరమేశ్, ఆయన సతీమణి శ్రీదేవి తమ ఓటు హక్కును వినియో గించు కున్నారు. మండల పరిధిలోని పెద్దనపాడులో మధ్యాహ్నం ఓటు వేసే విషయంలో విషయంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాళ్లతో దాడిచేసుకున్నారు. కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే డీయస్పీ యశ్వంత్, సీఐ ఈశ్వరయ్యలు రంగ ప్రవేశం ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం పోలింగ్ యథావిధిగా జరిగింది. సమాచారం తెలుసుకున్న కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి పెద్దన పాడుకు చేరుకుని కూటమి కార్యకర్తలతో మాట్లాడారు.ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పోలింగ్ బూత్ సందర్శించారు. ఎర్రగుంట్ల నగరపంచాయతీలోని బాలుర ఉన్నతపాఠశాలో టీడీపీ ఏజెంట్ల గుర్తింపు కార్డులు పోలీసులు చించారని టీడీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈవిషయం తెలుసుకున్న ఆదినారాయణరెడ్డి హుటా హుటిన పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని సీఐతో మాట్లాడారు. తమ ఏజెంట్ల గుర్తింపు కార్డులు చించిన కానిస్టేబుల్‌పై ఎస్పీ సిద్దార్థ్‌కు ఫిర్యాదు చేశారు. అతన్ని వెంటనే ఆ కానిస్టేబుల్‌ను అక్కడి నుంచి పోలీసుస్టేషన్‌కు పంపివేశారు. కాగా జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తన స్వగ్రామమైన నిడుజువ్విలో తన ఓటు హక్కును ఉదయం వినియోగించుకున్నారు.

మైదుకూరు/ మైదుకూరు రూరల్ ..:


మైదుకూరు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన తీరులో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. పలు 400 ఓట్లు నుంచి 4 వేల ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లోనూ ఒక హోంగార్డు లేదా ఒక కానిస్టేబుల్ మాత్రమే కన్పించారు. వారికి తోడుగా పోలీస్ వలంటీరు లేదా ఎన్‌సీసీ విద్యార్థి మాత్రమే ఆ పోలింగ్ కేంద్రాలకు రక్షణగా నిలబడ్డారు. కాగా చాపాడు మండలం చిన్నగులువలూరులో టీడీపీ ఏజెంట్‌ను వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు ఈడ్చుకొచ్చి రాళ్లతో దాడి చేశారు. అలాగే ఖాజీపేట మండలంలో పుల్లూరులో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బి మఠం మండలం డీ నేలటూరులో రాత్రి 8.30, మైదుకూరు మున్సిపల్ పరిధిలో శెట్టివారిపల్లెలో 7.30 దాకా పోలింగ్ నిర్వహించారు. మిగిలిన ప్రాంతాల్లో6.30 కల్లా పోలింగ్ ముగిసింది. కాగా మైదుకూరు నియోజకవర్గంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో 11 ప్రాంతాల్లో ఈవీయమ్‌లు మోరా యించాయి. పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పరిశీలించారు. చాపాడు మండలం చిన్న గులువలూరులో టీడీపీ ఏజెంట్‌పై దాడి చేయడంపై టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదు చేయడంతో ఆయన చిన్నగులువలూరుతో పాటు పలు కేంద్రాలను పరిశీలించారు. అక్కడ వైసీపీ ఏజంట్లకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. కార్యకర్తలను భయబ్రాంతులకు గురిచేసి ఓటింగ్ వేసుకోవాలని చూస్తే సహించేది లేదని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు.

పెద్దముడియం..: పెద్దముడియం మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఎక్కడా కూడా ఎలాంటిచిన్న సంఘటన జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

బి.కోడూరు..: బి.కోడూరు మండలంలో మొత్తం 22 పోలింగ్ బూత్‌లు ఉండగా అందులో రామసముద్రం పోలింగ్ బూత్ ఈవీయం మొరాయించడంతో ఉదయం 8గంటలకు పోలింగ్ మొదలైంది. అలాగే అంకన గొడుగునూరు మండలంలో అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గోపవరం..: గోపవరం మండల వ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. వృద్ధులు ఎండను లెక్కచేయకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఓటింగ్ సరళిని పరిశీలించారు.

చాపాడు..: మండలంలోని వెదురూరు, రాజుపాళెం, పెద్దగురవలూరు, అయ్యవారిపల్లె గ్రామాల్లో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. ఈ గ్రామాల్లో మొత్తం 4,649 మంది ఓటర్లు ఉండగా 4,138 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఓటర్లు సాయంత్రం 6 గంటల నుంచి క్యూలో ఉన్నారు. రాజుపాళెం గ్రామంలో రాత్రి 10 వరకు పోలింగ్ జరిగింది.


మైలవరంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


ప్రొద్దుటూరు...అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు


పోరుమామిళ్లలో వైసీపీ , టీడీపీ శ్రేణుల తోపులాట


ముద్దనూరులో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న షర్మిల


బద్వేలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు


కాశినాయనలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకున్న విజయమ్మ, రితీశ్‌రెడ్డి


కలసపాడులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న దృశ్యం


రాజుపాలెంలో బారులు తీరిన ఓటర్లు



ఖాజీపేటలో బారులు తీరిన ఓటర్లు, చాపాడులో దాడి సంఘటనపై ఫోన్‌లో ఎస్పీతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్


కలమల్లలో బారులు తీరిన ఓటర్లు


ఓటు హక్కును వినియోగించుకున్న విజయజ్యోతి


ప్రొద్దుటూరులో ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధుడు


పోరుమామిళ్లలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న